# జ్ఞానవాపి మసీదు కేసు

# ఏ ప్రాధాన్యతా లేని వాటిని, అత్యంత ప్రధానమైనవిగా ఎందుకు చూపుతున్నారు!?

**ప్రజలు** ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలు ఏవి!? బనారస్‌లోని జ్ఞానవాపి మసీదులో, శివలింగం ఉండేదా లేదా అనే దాని గురించి తాడో పేడో తేల్చుకొనే పరిస్థితి సృష్టించాలనేంత తీరికా, సౌలభ్యం భారతదేశ ప్రజలు కలిగి ఉన్నారా!? ఈ సమస్య మీద పాలకముఠా, దాని నియంత్రణలోని సంస్థలన్నీ కలిసి న్యాయ వ్యవస్థను ఎందుకు పురిగొలుపుతున్నాయి!? అలాగే సాయుధ బలగాలు ఈ సమస్య మీద ఎందుకంత శక్తివంతంగా స్పందిస్తున్నాయి!? ఈ ప్రశ్నలకు సమాధానం పొందాలంటే మనం ఈ రోజు ప్రజల కళ్ళకు కట్టినట్టుగా కనబడుతోన్న కొన్ని ముఖ్యమైన సమస్యలను క్లుప్తంగానైనా చర్చించుకోవాల్సిన అవసరం వుంది!.

భారతదేశంలో చాలా చోట్ల పెట్రోలు ధర రూ॥ 100 దాటి పోగా, డీజిల్ రూ॥ 100కు అటు ఇటుగాను, ఇంటి గ్యాస్ ధర 1000 దాటేసింది; పప్పు ధాన్యాలు, వంట నూనెలు, చక్కెర మొదలైన అత్యవసర సరుకుల ధరలన్నీ కూడా సామాన్యుడికి అందుబాటులో లేకుండా ఆకాశాన్ని తాకుతుండగా, కూరగాయల్ని బంగారం అమ్మినట్టు అమ్ముతున్నారు! మరో వైపు నిరుద్యోగం తారాస్థాయికి చేరగా, కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యోగాలను కోల్పోయారు. పట్టణ, గ్రామీణ పేదలందరికీ తాము బియ్యం, గోధుమ ఉచితంగా సరఫరా చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబ్బా కొట్టుకుంటున్నాయి కానీ, ఆ పేదలు గ్యాస్, నూనెలు, పప్పుధాన్యాలు, చక్కర, ఉప్పు లాంటి అత్యవసరాలు లేకుండానే వాటిని వండుకుని తినగలరని అనుకుంటున్నారా!

అదే సమయంలో అంబానీ, అదానీ, జిందాల్ ఇంకా వాళ్ళ కోవకు చెందిన బడా బాబులు వృద్ధి చెందడమే కాకుండా, ఆర్థికవ్యవస్థలోని అన్ని ముఖ్యమైన రంగాలను కొన్ని విదేశీ మదుపరులతో పాటు చేజిక్కించుకుంటున్నట్లుగా అందుబాటులో వున్న గణాంకాలు చూపిస్తున్నాయి. మైనింగ్, హైవే, ఎయిర్ పోర్టు, టూరిస్టు కేంద్రాలు లాంటి వాటి నిర్మాణాల కోసం రైతులు, టీ తోటల కార్మికులు, ఆదివాసీలను వెళ్లగొట్టి వాళ్ళ భూములను పెద్ద ఎత్తున చేజిక్కించుకుంటున్నారు!

మోడీ 'అచ్ఛే దిన్' బండారం బయటపడింది. కోవిడ్-19 విపత్తు ముసుగులో ఇంకెంతోకాలం అన్నిటినీ కప్పెట్టలేరు.

ప్రతిచోటా ప్రజలు ఉద్యమిస్తున్నారు. ఉత్తర భారత రైతాంగం దారి చూపగా, అఖిల భారత సమ్మెలతో కార్మికులు వీధుల్లోకి వచ్చి బారికేడ్లు నిర్మించడానికి సిద్ధమవుతున్నారు. శ్రీలంక తరహా ధర్నాలకు దారితీస్తుందేమోనని కేంద్రంలోని ప్రభుత్వం ప్రాణ భయంలో పడ్డట్టుగా కనబడుతోంది.

**ఈ పరిస్థితి ఎందుకు తలెత్తింది?**

ప్రజల పట్ల కనీస బాధ్యత గల ఏ ప్రభుత్వమైనా ప్రజల సమస్యల పరిష్కారానికి కొన్ని పటిష్టమైన చర్యలు తీసుకునేది. కానీ అది దేశంలో మతపర ఉద్రిక్తతలను రెచ్చగొట్టడంలో తీరిక లేకుండా ఉంది.

1) వారణాసి (కాశీ) నుండి లేదా దాని చుట్టుపక్కల నుండి ఏ ఒక్క వ్యక్తి కాకుండా, ఢిల్లీ నుండి నలుగురు మహిళలు జ్ఞానవాపి మసీదు ప్రాంతంలో శివుడిని పూజిస్తామంటూ కోర్టుకు వెళ్లడం చూస్తే, ఇది కేంద్రం ప్రేరణతో చేసిందనే వాస్తవం స్పష్టం అవుతుంది.
2) వింతగా వారణాశి జిల్లా కోర్టు జడ్జి, ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం-1991ను పక్కనపెట్టి ఆ కేసును వెంటనే స్వీకరించారు. అప్పటికే కోర్టు విచారణలో వున్న బాబ్రీ మసీదు కేసులో తప్ప, 15 ఆగష్టు, 1947 నాడు ఉన్న విధంగానే ప్రార్థనా స్థలాల మత స్వరూప స్వభావాలను యధావిధిగా కొనసాగించాలని ఈ చట్టం చెబుతోంది.
3) జ్ఞానవాపి మసీదు ఆధీన ప్రాంతంలో సర్వే చేసి హిందూ దేవతల విగ్రహం/విగ్రహాలను వెదకడం కోసం కోర్టు వెంటనే ఒక కమీషనర్‌ను నియమించింది.
4) ఆ ప్రాంతంలో ప్రవేశానికి ఆంక్షలున్నప్పటికీ పెద్ద ఎత్తున ప్రజలు "దొరికింది..దొరికింది" అంటూ వెంటనే అరవడం మొదలెట్టారు.
5) నమాజుకు ముందు చేతులు కాళ్ళు కడుక్కునే అవుజుఖానా ప్రాంతంలో శివలింగాన్ని పోలిన ఒక రాయి దొరికినట్టు తెలుస్తుండగా, అది నీటిని సరఫరా చేసే ఫౌంటెన్‌లో భాగమని చాలా మంది భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో ప్రవేశానికి కోర్టు ఉత్తర్వు ద్వారా ఆంక్షలు ఉన్నప్పటికీ అటువంటిదేదో దొరికిందని ప్రజలకు ఎలా తెలిసిందనేది అతి ముఖ్యమైన ప్రశ్న!
6) అందువల్లనే ఇందులో అయోధ్య లాగ పెద్ద ఎత్తున కుట్ర కోణం దాగి ఉందనే అనుమానం తలెత్తుతోంది. అయోధ్య కేసులో సర్వోన్నత న్యాయస్థానం కూడా అధికారంలో వున్న మతతత్వ శక్తి ముందు తల వంచి, తీర్పును శాస్త్రీయ రుజువులు, సాక్ష్యాల మీద ఆధారపడి కాకుండా, విశ్వాసాలు, నమ్మకాల మీద ఆధారపడి ఇచ్చింది.
7) ప్రస్తుతానికైతే సుప్రీమ్ కోర్టు నుండి ఈ కేసు తిరిగి వారణాసి జిల్లా కోర్టుకు చేరింది.

### పౌరాణిక కల్పన నుండి విశ్వాసానికి

"జ్ఞాన తటాకం" అనే అర్థం వచ్చే జ్ఞానవాపి అనే పదానికి వక్రీకరణనే "జ్ఞానవాపి"! వారణాసిలోని హిందువులు, ముస్లిములు ఇద్దరికీ చెందిన పవిత్ర ప్రాంతంగా జ్ఞానవాపి వుంది.

జ్ఞానవాపికి చెందిన కాల్పనిక గాథ ఈ విధంగా వుంది– ఒకానొక కాలంలో మూడు సముద్రాలలో తప్ప నీరు లేని పరిస్థితి ఏర్పడడంతో, వాటికి దూరంగా వున్న కాశీలోని ప్రజలకు తాగడానికి కానీ, స్నానానికి కానీ నీరు లేకపోయింది.

"17, కానీ శక్తివంత దేవత ఐన ఇషానా శివలింగాన్ని నీళ్లతో కడిగి పూజ చేయాలనుకుంది. రుద్రుడిలాగానే భయంకరాకారం కల ఇషానా తన త్రిశూలంతో అత్యంత వేగంగా లోతైన గోతిని తవ్వింది. ఆ ప్రాంతం విశ్వేశ్వరుడికి దక్షిణంగా అతి దగ్గరలో వుంది.

18, అప్పుడు, ఓ మహర్షి! నీటిధారలు ప్రవాహంలా ఉబికి పైకి ఎగజిమ్మి భూమండలాన్నంతటిని ముంచెత్తి దాని పరిణామముకన్నా పదిరెట్లు వచ్చి నలుదిక్కులా నిండిపోయాయి. (స్కంద పురాణం, 4వ పుస్తకం, కాశికాండ, 33వ అధ్యాయం, ఆంగ్ల అనువాదం)."

అప్పుడు ఇది ఎందుకు జ్ఞానవాపి లేదా గ్యానవాపిగా ఎందుకు పిలవబడుతుందో వివరించబడింది.

శివపురాణం ప్రకారం గుజరాత్‌లోని సోమనాథ్, శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి, ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ మొదలైన వాటిలాగానే, కాశీలోని విశ్వనాధుడు కూడా 12 జ్యోతిర్లింగాలలో ఒకటిగా పూజించబడతాడనే విషయం అందరికి తెలుసు.

స్కంద పురాణంలోని కాశీకాండలో మాత్రమే విశ్వేశ్వరుడిని ప్రధాన దేవతగాను, అక్కడ కూడా అవిముక్తేశ్వర లింగంగా కూడా దేవుడు కొలువై ఉంటాడని చెప్పబడింది. "ఆ లింగం జన్మ వృత్తాంతము లేనిదని" చెప్పింది. అది విశ్వేశ్వరుడితోనే స్వయంగా ఆరాధించబడుతుంది. మోక్షం కోసం కాశీలోని ఈ అవిముక్తేశ్వర లింగాన్ని దీక్షతో ఆశ్రయిస్తారు.

"(వేరే చోట్ల) పుణ్యస్థలాలన్నిటా ఎన్నో లింగాలున్నాయి. మాఘమాసం నెల మధ్యలో చీకటి రోజున ఈ లింగాలు ఉద్భవిస్తాయి." (స్కంద పురాణం, 4వ పుస్తకం, కాశీకాండ, ఆంగ్ల అనువాదం)

స్వంతంగా ఆలోచించగల ఎవరైనా ఈ కల్పనలలోని అంతర్వైరుధ్యాలను, తప్పులను కనిపెట్టగలరు.

### వాస్తవం : నిజాలు – ఆధార రహిత కథనాలు

మతతత్వ శక్తులకు అనుకూలంగా వున్న బ్రిటిష్ ప్రాయోజిత చరిత్రనే వాస్తవాలుగా మీడియాలో చూపిస్తుండడం వల్ల మనం బలవంతంగానే దీన్ని చర్చించాల్సి వస్తోంది.

వాటిలో ఔరంగజేబు కాశీ విశ్వనాథ మందిరాన్ని కూల్చి వేయడం గురించి చెప్పేది అతిముఖ్యమైనది. బ్రిటీష్ చరిత్రకారులు, వారి అనుయాయులు మనల్ని నమ్మించాలని ప్రయత్నించినట్టుగానే, అత్యంత అభ్యుదయకర మీడియా, సంస్థలు, వ్యక్తులలో కూడా కొందరు ఔరంగజేబు హిందూ మతం పట్ల అసహనంతో మందిరాన్ని కూల్చివేశాడని నమ్ముతున్నారు.

బనారస్‌లోని జంగం బడి శివమందిర్‌తో సహా, పలు హిందూ దేవాలయాలకు భూఖండాలను (జాగీర్లు) ఇస్తూ ఔరంగజేబు లెక్కలేనన్ని ఉత్తర్వులు (ఫర్మానాలు) ఇచ్చాడనే విషయం వాళ్ళు మర్చిపోతున్నారు. మాజీ ఒడిస్సా గవర్నర్, ప్రముఖ చరిత్రకారుడైన శ్రీ బి.ఎన్.పాండే "ఇస్లాం మరియు భారత సంస్కృతి" అనే తన పుస్తకంలో, ప్రముఖ హిందూ దేవాలయాలకు జాగీర్లు, పూజాదికాలు అవసరమైన నెయ్యి లాంటి వాటిని అందచేయాలని ఔరంగజేబు ఇచ్చిన అటువంటి ఫర్మానాల జాబితాను ఇచ్చి, సంబంధిత దేవాలయాల మహంతులే వాటి కాపీలను తనకు ఇచ్చారని రాశారు. ఉజ్జయిని మహాకాళేశ్వరి దేవాలయం, చిత్రకూట్ బాలాజీ దేవాలయం, గౌహతి ఉమానందన్ దేవాలయం, శత్రుంజయ్ జైన్ మందిరం, ఉత్తర భారతంలోని పలు గురుద్వారాలు ఆ జాబితాలో ఉన్నాయి. ఈ ఫర్మానాలు 1659 సం॥ నుండి 1685 వరకు ఇచ్చినట్టుగా వున్నాయి (పేజీ 36). బనారస్‌లోనే పలువురు హిందూ పూజారులకు భువిరాళాలు ఇచ్చాడు.

కానీ వారణాసిలో విశ్వనాథ దేవాలయాన్ని, గోల్కొండలో జామా మసీదును కూలగొట్టమని ఔరంగజేబు ఆజ్ఞాపించాడనడంలో ఎటువంటి సందేహం లేదు. ఎవరూ గోల్కొండ మసీదు గురించి మాట్లాడరు. అయితే సంక్షిప్తత కోసం మేము కూడా దాని గురించి లోతుగా వెల్లడలుచు కోలేదు. సాధికార కథనం కోసం ఆసక్తి గల వారెవరైనా సరే మమ్ములను సంప్రదించవచ్చు. ఈ కూల్చివేతల వెనక గల వాస్తవ కారణాలను, ఒకప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు, అసాధారణమైన పాండిత్యముకల డాక్టర్ పట్టాభి సీతారామయ్య వాస్తవాలు, సాక్ష్యాల ఆధారంగా "ఫెథెర్స్ అండ్ స్టోన్స్" అనే తన ప్రముఖ రచనలో వివరించాడు. శ్రీ బి.యన్.పాండే ఈ కింది విధంగా వివరించారు:

"ఔరంగజేబు ఒకసారి కాశీ మీదుగా బెంగాల్ పోతుండగా స్థానిక రాజులు ఆయనను ఒకరోజు తమ ప్రాంతంలో విడిది చేయమని, ఆ సమయంలో రాణులు గంగా నదిలో పవిత్ర స్నానం చేసి కాశీ విశ్వేశ్వరుడిని పూజించుకోవచ్చని కోరగా అందుకు ఆయన వెంటనే అంగీకరించాడు. ఐదు మైళ్ళ వారణాసి రహదారి పొడుగూతా సైనిక రక్షణ కలిపించగా రాణులు పల్లకీలలో వెళ్లారు. వాళ్లలో కచ్ మహారాణి తప్ప మిగతా అందరు పూజలు చేసుకుని తిరిగి వచ్చారు. ఎంత వెదికినప్పటికీ ఆవిడ దొరకలేదు. ఈ విషయం తెలిసిన ఔరంగజేబు తన ఉన్నతాధికారిని పిలిచి ఆమెను వెతికి

తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. ఎట్టకేలకు వాళ్ళు ఒక గోడకు బిగించి వున్న గణేశుడి విగ్రహాన్ని కదపవచ్చని కనిపెట్టారు. ఆ విగ్రహాన్ని కదపగా ఒక నేలమాళిగలోకి మెట్ల దారి వచ్చింది. దానిగుండా వెళ్లగా తప్పిపోయిందనుకున్న రాణి తన నగలన్నీ పోగొట్టుకుని అవమానకర రీతిలో ఏడుస్తూ కనపడగా చూసి నివ్వెరపోయారు. విశ్వనాథుడి దేవతా మూర్తికి సరిగ్గా కిందనే ఆ నేలమాళిగ వుంది. ఈ సంఘటనను ఆ రాజులు తీవ్రంగా ఖండించారు. ఇటువంటి నీచమైన నేరానికి పాల్పడినందుకు అందరికి గుర్తుండేలా చర్య తీసుకోవాలని డిమాండు చేశారు. పవిత్రమైన ఆవరణ కలుషితమైపోయిన కారణంగా విశ్వనాథ దేవత విగ్రహాలను వేరే ప్రాంతానికి తరలించి, ఆ దేవాలయాన్ని కూల్చి వేయాలని, మహంతును అరెస్టు చేసి శిక్షించాలని ఔరంగజేబు ఆజ్ఞాపించాడు. (పేజీ 44-45)

ఆ తర్వాతి కాలంలో రాణి అహల్యాబాయి పాత దేవాలయానికి పక్కనే శివలింగం, విశ్వనాథ విగ్రహాలతో కొత్త దేవాలయాన్ని నిర్మించింది. కొన్నాళ్ళకు జ్ఞానవాపి బావికి దగ్గరలో మసీదు నిర్మించబడింది. దాని తర్వాత అంతా సజావుగానే సాగింది. 1803 సం॥లో కంపెనీ పరిపాలనలో మతపర ఉద్రిక్తత చెలరేగినట్టు రిపోర్టు వచ్చింది. దీన్ని సాకుగా తీసుకుని విభజించి పాలించే అవకాశముందని గ్రహించిన జేమ్స్ ప్రిన్స్ అనేవాడు ఎటువంటి వాస్తుశిల్ప ఆధారాలు గాని, భారతదేశంలో దేవాలయ నిర్మాణ రీతులకు గాని పొంతన లేకుండా ఒక ఊహాజనిత కథనాన్ని 1833లో ప్రచురించాడు.

## వర్తమానంలో మతతత్వ ప్రచారం

కానీ చాలా కాలం తర్వాత సంఘీయులు, వాళ్ల కోవకు చెందిన వాళ్లు అయోధ్య కాలం నాడే కాశీ, మధుర తమ జాబితాలో వున్నాయంటూ నినాదం ఇస్తూ జ్ఞానవాపి మసీదుకు వ్యతిరేకంగా ప్రచారం మొదలెట్టారు. అది అంత సులభమేమి కాదు. అయోధ్య మీద తీర్పు తర్వాత కూడా సంఘీయులలో ఆ తీవ్రత కనబడలేదు. కానీ మోడీ యోగీల కాశీ విశ్వనాథ్ కారిడార్ పూర్తయినాక, దాని వలన నిరాశ్రయులైన ప్రజలలో దాదాపు అందరూ కూడా కాశీ విశ్వనాథుని భక్తులు అయి ఉండడం, వాళ్ళు తమ పూర్వీకుల ఇళ్లను కొద్దిపాటి పరిహారం లేదా అసలు లేకుండానే కోల్పోవడంతో (ఆ ఇళ్లలో ఎక్కువ వాటిలో స్వంత దేవాలయాలుండేవి), వాళ్లంతా తీవ్ర ఆగ్రహంతో ఉండడంతో సంఘీయులు కాశీ విశ్వనాథ్ సమస్య మీద మత విభజన రెచ్చగొట్టే పని మొదలెట్టారు. వీధుల్లోకి వస్తున్న ప్రజలను విభజించడంతో పాటు, కాశీలోనే అసంతృప్తి స్వరాలను మూగబోయేలా చేయడంలో పాలకులకు సహాయపడడానికి ఈ సమస్యను కనిపెట్టారు. ఇప్పటికిప్పుడు నిజమేమిటనేది ఎవరికీ తెలీదు కానీ అవూజ్ ఖానా దగ్గర శివలింగం దొరికిందని పుకారు లేవదీయడం ఓ తెలివైన ఉపాయమే! "వారణాసిలో ప్రతి కంకర శివ శంకరుడే!" అని వారణాసిలో ఓ నానుడి వుంది! వారణాసిలో ఏ రాయయినా శివుడే అని దాని అర్థం! వారణాసిలో ఎక్కడైనా పాత రాళ్లు దొరకవచ్చు.

## మతతత్వ శక్తులను ఓడించి తీరాలి

వాస్తవమేమిటంటే విదేశీ యజమానులకు, దళారీ అధికార పెట్టుబడిలోని నీచమైన, హింసాయుతమైన తరగతులకు, ఫ్యూడల్ శక్తులకు చాకిరీ చేస్తోన్న ప్రస్తుత పాలకులకు ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఎటువంటి మార్గం తెలీడంలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలను మతపరంగా విభజించడంతో పాటు, అన్నిరకాల ఫాసిస్ట్ చర్యలు తీసుకుంటున్నారు. దానిలో జ్ఞానవాపి ఒక మాయోపాయం మాత్రమే!

ఈ పరిస్థితులకు తగ్గట్టుగా ఈ పాలక ముఠా అనుసరిస్తోన్న అన్ని రకాల అణచివేతలకు వ్యతిరేకంగా అడుగడుగునా పోరాడడానికి మనం సిద్ధపడాలి. అదే సమయంలో హిందుత్వ పేరుతో వస్తోన్న మతతత్వ సంఘీయులకు వ్యతిరేకంగా వర్గ, కుల, మత, జాతి, భాషలకతీతంగా ప్రజలను సమీకరించి వాళ్ళను తిప్పికొట్టాలి. లౌకిక ముసుగులో వుంటూ బాబ్రీ మసీదు కూల్చివేత ప్రయత్నానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజా ఉద్యమాన్ని బలహీనపరిచి, వివాదాస్పద బాబ్రీ మసీదు ప్రాంతంలో హాస్పిటల్ లేదా యూనివర్సిటీ నిర్మించాలని కోరుతున్న వారి పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి. ఆ విధంగా వాళ్ళు కూల్చివేతకు అనుకూలురేనని బయటపడ్డారు. ఎందుకంటే కూల్చివేయకుండా గుడి కానీ, హాస్పిటల్ కానీ, యూనివర్సిటీ కానీ నిర్మించలేము కదా!

**ఐక్యతతో ప్రజానీకమే విజయం సాధిస్తుంది!**

**ఎదిరించి పోరాడు! విజయం సాధించు!!**

*****